ప్రజాశక్తి

శనివారం 21 సెప్టెంబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు



అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:దీపావళి పండగ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అనుమతి తీసుకోకుండా బాణసంచాలు విక్రయిస్తే చర్యలు తప్పదని స్థానిక ఎస్సై కె.పి నాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బాణసంచాలను విక్రయించేవారు కచ్చితంగా అనుమతులు తీసుకోవాలన్నారు. మావోయిస్టు ఆవిర్భావ దిత్సవాల్లో భాగంగా మండల వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామన్నారు. వాహనాల తనిఖీలతో పాటు కల్వర్టులు, బ్రిడ్జిల్లో సైతం తనిఖీలు నిర్వహిస్తూ.. రాత్రుల్లో కూడా ప్రత్యేక పోలీసుల బలగాలతో ప్రధాన రోడ్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సెల్ టవర్ల వద్ద కూడా పోలీసులతో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. గంజాయి నిర్మూలనకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ నాయుడు

అక్రమ నిర్మాణాలను నిలిపేయాలి

-గిరిజనేతరులపై కేసులు నమోదు చేయాలి - ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాకేంద్రంలో అక్రమంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని విపరీతంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, తక్షణమే వీటిని నిలిపేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు. గిరిజనేతరుడైన షేక్ పీర్ అక్రమ నిర్మాణం చేపడుతున్న స్థలంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ధర్మన్న పడాల్, పొద్దు బాలదేవ్, కృష్ణారావు, సత్యనారాయణ మాట్లాడుతూ, అక్రమ నిర్మాణాలపై అధికారులు సుమోటోగా కేసులు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం ఆలక్ష్యం వహిస్తుందన్నారు. దీంతో, జిల్లా కేంద్రంలో విపరీతంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. పాడేరు కేంద్రంలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలపై సమగ్రంగా సర్వే చేసి ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకొని అక్రమ భవనాలు నిర్మిస్తున్న గిరిజనేతరులపై కఠిన చర్యలు తీసుకొని డిమాండ్ చేశారు. షేక్ ఫిర్ అనే గిరిజనేతరుడు మొదకొండమ్మ గుడి కిందన ప్రభుత్వ భూమినీ ఆక్రమించుకొని దర్జాగా బహుళ అంతస్తులు నిర్మించుకొంటుంటే, అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలని,వారిపై ఎల్టిఆర్ కేసు నమోదు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం తహసిల్దారుకి పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, సుందర్‌రావు, చిట్టిబాబు, బొజ్జన్న, అప్పలకొండ పడాల్, పాంగి లింగమూర్తి, కే అనంత కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు


విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

నాణ్యమైన విద్యను అందించండి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:గిరి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని స్థానిక అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కేజీబీవీ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న విద్యా బోధనపై అడిగి తెలుసుకున్నారు. తెలుగు సబ్జెక్టుపై విద్యార్థులతో చదివించారు. విద్యార్థులు సరిగా చదవక పోవడంతో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.పాఠశాలలో త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీటినీ అందించడానికి ఇబ్బంది కలుగుతుందని ఎమ్మెల్యే దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. విద్యుత్ శాఖ ఏఈకు ఎమ్మెల్యే ఫోన్ చేసి త్రీఫేస్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ దుర్గభవాని పాల్గొన్నారు.

ఇంటిలో కలప పట్టివేత

ప్రజాశక్తి- చింతపల్లి: చింతపల్లి సెక్టర్ పరిధిలోని రెండు లక్షల విలువచేసే కలప స్వాధీన పరచుకోవడం జరిగిందని అటవీ శాఖ చింతపల్లి రేంజ్ అధికారి బి అప్పారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి రేంజ్ సెక్టర్ పరిధిలోని గడపరాయి గ్రామంలో కార్పెంటర్ కేశవరావు నివాస గృహంలో నిలువ చేసిన కలపను అటవీ శాఖ ఉత్తరాంధ్ర స్కాడ్ సిబ్బందికి గుర్తుతెలియని వ్యక్తులు సమాచారం అందించడంతో గడపరాయి గ్రామంలో కార్పెంటర్ కేశవరావు ఇంట్లో నిలువ చేసిన కలపను స్వాధీనం చేసుకుని చింతపల్లి డివిజనల్ అటవీశాఖ కార్యాలయానికి తరలించడం జరిగిందన్నారు. వేగిస, గన్నర్ మద్ది, టేకు మొత్తం 178 కలప ముక్కలు విలువ సుమారు రెండు లక్షలు ఉంటుందన్నారు. ఫారెస్ట్ చట్టం ప్రకారం కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.


కలపను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

'మీకోసం' సమస్యలను పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, ఐ.టి.డి.ఏ పి.ఓ. వి.అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డి.ఆర్.ఓ. బి.పద్మావతి సంయుక్తంగా వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 126 వినతులను స్వీకరించారు. రహదారుల నిర్మాణాలు, తాగునీటి సమస్యలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, అంగన్వాడీ కేంద్రాల మంజూరు, చెక్ డ్యాం నిర్మాణాల కోసం ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్దేశించిన సమయానికి ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ డిపార్టుమెంటులో 131, పంచాయతీ రాజ్ 21, గ్రామీణ నీటి సరఫరా విభాగం 12, గిరిజన సంక్షేమ శాఖలో 18 ఫిర్యాదులు ఉన్నాయని మిగిలిన శాఖలలో 1 లేదా 2 ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు.

కొన్ని వినతులు

ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ చివుకు చింత గ్రామస్తుడు అంబిడి వెంకట ప్రసాద్ పంపు ఆపరేటర్ ఉద్యోగం కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. చింతపల్లి మండలం బలపం గ్రామస్తుడు బి.చిరంజీవి తన తండ్రి పేరు ఆన్లైన్లో కనబడటక పోవడంతో రైతు భరోసా అందడం లేదని, దానిని సవరించాలని కోరారు. అనంతగిరి మండలం కాకరపాడు గ్రామస్తులు కె.గురుమూర్తి తదితరులు ఎగువశోభ నుండి కాకరపాడు గ్రామం వరకు బిటి రోడ్డు నిర్మించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు సర్పంచ్ పి.రామ్మూరి పంచాయతీ పరిధిలోని బొడ్లమామిడి, డెక్కపారు, వై. కొల్లాపుట్టు తదితర గ్రామాలకు చెక్ డ్యాంలను నిర్మించి సాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవనాల శాఖ ఎస్ డిసి వి.వి.ఎస్. శర్మ,

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి .జమాల్ భాషా, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజిరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్. కుమార్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.సంద్, జిల్లా ఉద్యాన వన అధికారి రమేష్ కుమార్ రావు తదితరులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి, పిఒ


వర్షంతో నిర్మానుష్యంగా ఉన్న సంత

వర్షంతో సాగని వారపు సంత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలోని పలు ప్రాంతాలతో పాటు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు భారీ వర్షం కురిసింది. అప్పటివరకు ఎండ కాసినప్పటికీ, ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భారీ వర్షం కురవడంతో జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా వారపు సంతకు వచ్చిన ప్రజలు, రైతులు, వర్తకులు ఇబ్బంది పడ్డారు. వర్షంతో వ్యాపారుల విక్రయాలకు తీవ్ర ఆటంకం కలిగింది. చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మారుమూల గ్రామాల నుంచి నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి వారపు సంతకు వచ్చిన గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంత సమయం తర్వాత వర్షం నిలిచి పోయినప్పటికీ, తర్వాత వారపు సంతలో వ్యాపారాలు యధాతధంగా సాగలేదు. లోతట్టు ప్రదేశాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లు బురదమయం కావడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి. రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో పాటు పంట పొలాల్లోని వర్షం మీరు వచ్చి చేరింది. పలుచోట్ల ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు.

తారు రోడ్డు పనులు ప్రారంభించాలి

-ఐటిడిఎ వద్ద గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని ఇరగాయి పంచాయితీ కాగువలస జంక్షన్ నుండి టీడీగుడ, ఉరుములు వరకు తారు రోడ్డు పనులు ప్రారంభించాలని శుక్రవారం పాడేరు ఐటిడిఎ వద్ద హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు టీడీగుడ, ఉరుములు, కాగువలస, కందులగుడ్డి, కొర్రీ గుడ, చిల్లీ బడి, బల్యగుడ, గాటివలస గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. అనంతరం స్పందన కార్యక్రమంలో జేసీ అభిషేక్ గౌడ కు వినతిపత్రం అందజేశారు.ట్రైబల్ జెఈ అభిషేక్ స్పందిస్తూ.. తారు రోడ్డు గ్రాంట్‌లో పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నందోలి ఈశ్వర్‌రావు, చిన్నారావు, జీ రాజబాబు, రఘునాథ్, జన్ని నాయుడు, జన్ని చిట్టిబాబు, నాగేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యే వరకు విద్యను బోధించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఉపాధ్యాయులను ఆదేశించారు. రంపచోడవరం మండలం బూసిగూడెం గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం పిఒ సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. వివిధ తరగతులకు వెళ్లి విద్యా బోధన ఏవిధంగా చేస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిఒ సింహాచలం మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సిలబస్ పూర్తి చేసి విద్యార్థులకు అర్థమైనదీ లేనిదీ తెలుసుకొని, అర్థం కాకపోతే ఒకటికి రెండుసార్లు విద్యా బోధన చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం మెనూ అమలు చేయాలన్నారు. టెన్త్ క్లాసులో మంచి మార్కులతో ఉత్తీర్ణులై ట్రిబుల్ ఐటీలో సీటు వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. అలాగే సివిల్ సర్వీస్ పోస్టు సంపాదించుకునే విధంగా విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామారావు తదితరులు పాల్గొన్నారు.


పాఠ్యాంశాలను విద్యార్థులతో చదివిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ, చిత్రంలో ఐటిడిఎ పిఒ సింహాచలం

రోగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు

వరదలు కారణం వల్ల ప్రబలే రోగాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీకే వీధి మండలం, సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి సూచించారు. సీలేరు పిహెచ్‌సి, దుప్పిలివాడ ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని గొర్రిలోవ, గుండారి బయలు, బంధవీధి గ్రామాల్లో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు చర్మవ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో సిబ్బంది పరిశీలించి మురికి కాలువలలో దోమలు ఏ విధంగా వృద్ధి చెందుతాయో, వాటి వల్ల ఎటువంటి వ్యాధులు సంభవిస్తాయో క్లుప్తంగా వివరించారు. టైర్లు, కాలువల్లో లార్వా ఏ విధంగా తయారవుతుందో స్వయంగా వైద్య సిబ్బంది ప్రజలకు చూపించి వివరించారు. ఈనెల 8న సంభవించిన భారీ వర్షాలకు గ్రామాల్లో చెత్త చెదారం, బురద చేరడం వలన అంటు రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని చెప్పారు. ఎవరైనా రోగాలు బారిన పడితే వెంటనే స్థానిక పిహెచ్సిని సంప్రదించి వైద్యసేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ త్రినాథ్ బాలమణి, హెచ్‌విజి ఎస్ఏఎన్ఎం అరుణ్ కుమారి, హెల్త్ అసిస్టెంట్ రాజబాబు, సత్యనారాయణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మురికి కాలువలను పరిశీలిస్తున్న వైద్యులు, సిబ్బంది

చిన్నారిపై లైంగిక దాడి కేసులో 25 ఏళ్లు జైలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని తంటికొండ పంచాయితీ ఎర్రంపాడు గ్రామంలో చిన్నారిపై లైంగిక దాడి చేసిన ముద్దాయికి కాకినాడ ఫోక్స్ కోర్టు మెజిస్ట్రేట్ 25 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. స్థానిక సిఐ ఎన్ సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ప్రకారం... ఎర్రంపాడు గ్రామానికి చెందిన వరహాలుబాబు అదే గ్రామానికి చెందిన చిన్నారిపై 2020 అక్టోబర్ 15న లైంగిక దాడికి పాల్పడినట్లు కేసు నమోదైంది. దీనిపై కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయి వరహాలబాబుకు కాకినాడ ఫోక్స్ కోర్టు మెజిస్ట్రేట్ 25 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునివ్వడం జరిగిందని సీఐ సన్యాసినాయుడు తెలిపారు.

బ్రిడ్జి అప్రోచ్ మరమ్మతు పనులు వేగవంతం

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం లంకపాకల-సంపంగిగొంది మధ్య గల వంతెన అప్రోచ్ మరమ్మతు పనులు వేగవంతం చేస్తున్నామని ఆర్ అండ్ బి జేఈ భరతుడు వెల్లడించారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 8న అర్ధరాత్రి సంభవించిన భారీ వర్షాలకు లంక పాకల -సంపంగ గొంది మధ్యలో వంతెన కోతకు గురై ప్రమాద స్థితికి చేరుకోవడంతో బస్సులు, ఇతర భారీ వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భారీ వాహనాలు రహదారి గుండా నడపకుండా చిన్న వాహనాలు మాత్రమే వెళ్లే విధంగా తాత్కాలిక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. కోతకు గురైన వంతెన అప్రోచ్‌కు కాంక్రీట్ పనులు నిర్వహిస్తున్నామని, పనులు దాదాపు పూర్తి కావచ్చాయని తెలిపారు. మరో మూడు రోజుల్లో నర్సీపట్నం, చింతపల్లి మీదుగా సీలేరు భద్రాచలం బస్ సర్వీస్ నడిచే అవకాశం ఉందని చెప్పారు.

రాజారావు, లోకేష్‌కుమార్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కొయ్యూరు

కొయ్యూరు ఎస్సైగా రాజారావు, మంప ఎస్సైగా లోకేష్ కుమార్, అదనపు ఎస్సైగా దేముడు అందించిన సేవలు మరువలేనివని కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్ఐ రామకృష్ణ, ఎంపీపీ బడుగు రమేష్, పలువురు నాయకులు కొనియాడారు. బదిలీపై వెళుతున్న రాజారావు, లోకేష్‌కుమార్‌లకు శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఘనంగా వీడ్కోలు పలికారు. క్రమ శిక్షణతో విధులు నిర్వహిస్తూ, ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని గుర్తు చేశారు. ఎస్సై రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ వెంకటరమణ



రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలుగా బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహమూర్తి, చినబాబు

ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని రాజవొమ్మంగి ఎస్ఐగా నరసింహమూర్తి, , జడ్డంగి ఎస్ఐగా చినబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు, నరసింహమూర్తి జిల్లా కేంద్రమైన పాడేరు ఎస్‌బి ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చారు ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన వెంకయ్య పాడేరు ఎస్‌బి ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. జడ్డంగి ఎస్సైగా పనిచేసిన రఘునాథరావు జగ్గంపేటకు బదిలీ కాగా, రంపచోడవరం నియోజకవర్గం గంగవరం ఎస్ఐగా పనిచేసిన చినబాబు జడ్డంగి ఎస్ఐ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారి పైనైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గంజాయి రవాణా, నాటుసార రవాణా విక్రయాలు అరికట్టడం జరుగుతుందన్నారు. వాహన తనిఖీలు ముమ్మరంగా చేపడతామని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు లేకపోయినా, హెల్మెట్ ధరించకపోయినా, మైనర్లుకు వాహనాలు ఇచ్చిన తగిన జరిమానా విధించడం జరుగుతుందని ఎస్ఐలు తెలిపారు.

ఉరుములతో భారీ వర్షం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపించడంతో ఎండ తీవ్రత అధికంగా ఉంది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములతో భారీ వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈనెల 8 అర్ధరాత్రి భారీ వర్షాలకు వందలాది ఎకరాల పంటలు వరద ప్రవాహాన్ని కొట్టుకుపోయాయి. ఆ నష్టం నుంచి ఇప్పటికీ గిరి రైతులు కోలుకోలేదు. భారీ వర్షంతో మునుపటి సంఘటన గుర్తుకొచ్చి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొంత సమయం తర్వాత వర్షం తగ్గి ముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

దారాలమ్మకు వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్‌లో ఉన్న దారాలమ్మ అమ్మవారికి 400 గ్రాముల వెండి కిరీటాన్ని కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన కురసాల సాయి వినీల్ కాంత్, ఆయన సతీమణి జాస్మిన్ శుక్రవారం ఉదయం బహూకరించారు. ముందుగా అమ్మ వారి సన్నిధిలో మొక్కులు తీర్చుకొని పూజలు నిర్వహించారు. అనంతరం కిరీటాన్ని అమ్మవారికి అమర్చారు. వెండి కిరీటాన్ని అమ్మవారికి సమర్పించినట్లు దేవాదాయ శాఖ ఎండోమెంట్ అధికారి సాంబశివరావు దృష్టికి ఆలయ పూజారులు తీసుకువెళ్లారు.


వెండి కిరీటాన్ని అందిస్తున్న సాయి వినీల్ కాంత్, జాస్మిన్ దంపతులు

ప్రకృతి వ్యవసాయంతో మేలు



అవగాహన కల్పిస్తున్న డిపిఎం భాస్కర్

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు చేకూరుతుందని రైతు సాధికార సంస్థ అల్లూరి జిల్లా డిపిఎం భాస్కర్ అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు మండలం బిరిసింగి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులకు, రైతులకు శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై వాసన్ సంస్థ, రైతు సాధికారిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంతర పంటలతో కలిగే లాభాలు, ప్రకృతి వ్యవసాయంలోని ఘన, ద్రవ జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం గురించి వివరిస్తూ తయారీ విధానాన్ని రైతులకు చేసి చూపించారు. చీడపీడలు నివారణతో పాటు అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. గోవుల పెంపకం వలన రైతులకు కలిగే ఆరోగ్య, ఆర్థిక లాభాల గురించి తెలిపారు. రసాయన ఎరువులు వాడటంతో నష్టాలను రైతులకు వివరించారు. రసాయానిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గడంతో పాటు చీడపీడలు పెరుగుతాయన్నారు. తక్కువ ఖర్చుతో ఇంటి వద్దే జీవన ఎరువులు తయారు చేసుకుని ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ఏడాది పొడవునా రైతులకు ఆదాయం లభించేలా ఒకే వ్యవసాయ క్షేత్రంలో వివిధ రకాల పంటలను పండించడం ద్వారా ఆదాయం పొందడమే ప్రకృతి వ్యవసాయం ప్రత్యేకత అని వివరించారు. ప్రకృతి వ్యవసాయం వాతావరణ పరిస్థితులను, విపత్తులను తట్టుకునే సామర్థ్యం ఉండటం, భూమి సారవంతంగా మారడమే కాకుండా మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లాలో 94,270 కుటుంబాలు, 1,74,908 ఎకరాల భూమిలో ప్రకృతి వ్యవసాయం పద్ధతులను అనుసరిస్తూ, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధిస్తున్నారని తెలిపారు. వాసన్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ బక్కారెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ నాయుడు, రైతుసాధికార సంస్థ సిబ్బంది రవీంద్ర, జానకి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాగులో పడి మహిళ మృతి

ప్రజాశక్తి- జి.మాడుగుల: వరద ప్రవాహంలో గురువారం మధ్యాహ్నం ఓ గిరిజన మహిళ బుడ్డిగెడ్డ వాగు దాటుతూ కొట్టుకుపోయింది. బంధువులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. షోలభం పంచాయతీ బంగారుబుడ్డి గ్రామ నివాసి కొర్ర కాంతమ్మ వయ్యారి గరువు గ్రామంలో తన మనుమడిని చూడడానికి వెళ్తూ కాలుజారి వాగులో పడిపోయింది. వాగులో కొట్టుకు పోవడంతో చుట్టుపక్కల గ్రామాల గిరిజనులు వెతకడంతో బుడ్డిగేడ్డ వాగు సమీపంలో మృతదేహం లభ్యమైంది. స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి శవపంచనామా చేయించి బంధువులకు అప్పగించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో నిందితునికి మూడురోజుల జైలు

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో వాహనం నడిపిన కేసులో నిందితునికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ట్రాఫిక్ ఎస్ఐ జి. ప్రసాద్ తెలిపారు. వివరాలివి. పిఎం.పాలెం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కొమ్మాది కే1కాలనీకి చెందిన పి.పైడిరాజు అనే వ్యక్తి మద్యం మత్తులో వాహనం నడుపుతుండగా, పోలీసుల తనిఖీల్లో పట్టుబడడంతో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విశాఖపట్నం స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు దీనిపై విచారణ జరిపి, నిందితునికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారని ఎస్ఐ తెలిపారు.

ఫోక్సో చట్టం కింద కేసు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక చిన్నబజారుకు చెందిన 16 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసి మోసం చేసిన భీమిలి బ్యాంక్ కాలనీకి చెందిన 16 ఏళ్ల బాలుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సిఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన, నిందితుడిని అదుపులోకి తీసుకుని జువైనల్ హోంకు తరలించినట్లుసిఐ తెలిపారు.

ప్రజారంజకంగా వంద రోజుల పాలన

'ఇదీ మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యేలు, నేతలు



రంపచోడవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రంపచోడవరం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలతు అర్హులందరికీ అమలు చేయడం జరుగుతుందని రంపచోడవరం శాసన సభ్యులు మిరియాల శిరీష దేవి అన్నారు. ఎపిలో టిడిపి కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన ప్రజారంజకంగా సాగిందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మడిచర్ల గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయభాస్కర్, సర్పంచ్ చిలకల విజయ శాంతి, ఎంపీటీసీ బచ్చల మంగాదేవి, నాయకులు చెల్లుబోయిన శ్రీనివాస రావు, కారం సురేష్, కారం సింహాచలం, అధికారులు పాల్గొన్నారు.

కొయ్యూరు : ఇది మంచి ప్రభుత్వం పేరుతో మాజీ ఎంపిటిసి గాడి శ్రీరామ్మూర్తి, మాజీ ఎంపీపీ గొలిసింది సత్యనారాయణ ఆధ్వర్యంలో రాజేంద్రపాలెంలో ప్రచార కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేంద్రపాలెం, కొయ్యూరు, రేవళ్ల సర్పంచులు, మాజీ ఎంపీటీసీ శివరామరాజు, కుర్రు రామ్మూర్తి, వార్డు నెంబర్లు, టిడిపి కూటమి కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మారేడుమిల్లి : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుండాడ, జిఎం.వలస పంచాయతీలకు సంబంధించి జిఎం.వలస గ్రామంలో సర్పంచ్ కారం లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, మారేడుమిల్లి టిడిపి మండల అధ్యక్షుడు జి శేష్ కుమార్, జనసేన మండల అధ్యక్షుడు యం.దుర్గాప్రసాద్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కె.సన్యాసిరెడ్డి, మండల పరిపాలన అధికారి పి.జయంతి, సెక్రటరీ కృష్ణ ప్రసాద్, సచివాలయ సెక్రటరీ దుర్గాప్రసాద్, వీఆర్వో మురళీకృష్ణ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: స్థానిక టిడిపి నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమాన్ని నిర్వహించారు. కొర్రాయి పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ పి కొములు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి, ఇంటింటికి టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజుల్లో చేసిన పనులపై కరపత్రాలను పంచిపెట్టారు. మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి ప్రతి గడపగడపకు కరపత్రాలను అంటించారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ టి యు సి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, ఎంపీటీసీ ఎం.గీత, ఎంపీడీవో బి.ఉషారాణి, పంచాయతీ కార్యదర్శి విజయ్, టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

హుకుంపేట: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని కోట్నాపల్లి పంచాయతీలో శుక్రవారం చేపట్టారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఎంపీడీవో ఆర్ వెంకటరావు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ఇదీ మంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని చేపటాటరు. ప్రజల వద్దకు వెళ్లి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుంబిడిసింగి పంచాయితీ అండేలిసింగి గ్రామంలో మాజీ మంత్రి మత్స్యరాస మణి కుమారి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిల్లు వెంకట రమేష్ నాయుడు, పలువురు సీనియర్ నాయకులు ఆయా గ్రామాలలో గడపగడపకు పర్యటించారు. వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ప్రజల ఆకాంక్షలకు, అవసరాలకు అనుగుణంగా పనిచేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమిదేనని పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు అన్నారు. అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ పరిధిలోని పెదలబుడులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని దాసుబాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసుబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ, పెన్షన్ పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రాజ్ కుమార్, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.





అరకులోయ, దుంబ్రిగుడలో ప్రచారం చేపడుతున్న నాయకులు

గీతం దూరవిద్య కోర్సుల్లో అడ్మిషన్లు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఒఇ) ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో ఎంఎ ఇంగ్లీష్, బిఎ, బికామ్ డిగ్రీ కోర్సులలో 2024 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఒఇ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు తెలిపారు. పూర్తి చేసిన ధరఖాస్తులను నవంబర్ 15వ తేదీలోగా అందజేయాలని, పూర్తి సమాచారం కోసం దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం cdl.gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెసి

ప్రజాశక్తి-పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు వారోత్సవాల సందర్భంగా పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణాన్ని దానం చేసిన వారమవుతారన్నారు. దాతలు మరింతగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆకాంక్షించారు. రక్తదాన శిబిరంలో 30 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ లోహితస్, హర్ష, సభ్యులు గౌరీ శంకర్, బీజేపీ నాయకులు ఉమామహేశ్వరరావు, పాంగి రాజారావు, శాంతకుమారి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -హుకుంపేట: జి.కె వీధి మండలం చట్రాపల్లి గ్రామ వరద బాధితులకు హుకుంపేట మండలంలోని మత్యాపురం ఎంపిపి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు రూ. 4300 విరాళాలు సేకరణ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను పలువురు అభినందించారు.

1317వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్ అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలేదీక్షలు శుక్రవారం 1317వ రోజున స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టియూసి నాయకత్వంలో వివిధ విభాగాల ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.దీక్షలో నాయకులు బి.నాగభూషణం, నీరుకొండ రామచంద్రరావు, బిఎన్.రాజు, జివి.సుబ్బయ్య, కొవిరి అవతారం, సుబ్బారావు, కె.రవి, దుర్గాప్రసాద్, ఎంఎస్ఆర్.ప్రసాద్, ఎం.దేముడు, జి.రాము, ప్రభాకర్‌రెడ్డి, బి.వేణువర్మ, గోపాల్ గంగవరం గోపి, రాజు, పి.పోతారెడ్డి, కొమ్ము ప్రసాద్, బి.గోపాల్, రమణ, నరేంద్రకుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఆనందపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మారికవలసకు చెందిన వెల్డర్ ఆర్.నర్సింగరావుకు వెల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.ఐదువేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ రఘు, అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ విజయ్,ఆనందపురం ఇంచార్జ్ వెన్ని.అప్పలరాజు , ముగడ శ్రీను, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఒ కట్టా సింహాచలం

మత్స్య సహకార సంఘాల పనితీరుపై సమీక్ష

ప్రజాశక్తి-రంపచోడవరం : మత్స్యశాఖ, రంపచోడవరం డివిజన్ పరిధిలోని గిరిజన మత్స్య సహకార సంఘాల పనితీరుపై ఐటీడీఏ మీటింగ్ హాల్లో రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అధ్యక్షతన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజన మత్స్య సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అవసరమయ్యే ఆర్థిక సాయం ప్రభుత్వం ద్వారా అందించడానికి చర్యలు, సదరు సంఘాల వారికి ప్రభుత్వం అందించే రాయితీల గురించి చర్చించడం జరిగింది. సంఘాల వారి నుండి వారు కోరిన రాయితీపై చేపల వేట ఉపకరణాలను, చేపల వ్యాపారం కోసం అవసరమైన ద్విచక్ర వాహనంతో పాటు శీతలీకరణ పెట్టెలు సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని పిఒ తెలిపారు. సమావేశంలో రంపచోడవరం మత్స్యశాఖ అభివృద్ధి అధికారి జె.సీతమరాజు, గ్రామ మత్స్య సహాయకులు కె.బాలాజీ, సిహెచ్ రామకృష్ణ, సత్యవతి, సత్యవేణి, 13 గిరిజన మత్స్య సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రగ్ ఉత్సవ్ - 2024 ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చేతితో తయారుచేసిన రగ్‌ల్లో గుర్తింపు పొందిన జైపూర్ రగ్స్ ప్రపంచంలోనే అతి పెద్దదని, రగ్ ఉత్సవ్ 2024ను తాజాగా ప్రారంభించామని జైపూర్ రగ్స్ డైరెక్టర్ యోగేష్ చౌదరి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రగ్ ఉత్సవ్ గ్రామీణ భారతీయ హస్త కళాకారుల కళాత్మకతకు ఒక వేదిక అన్నారు. చేతితో తయారుచేసిన తివాచీలు, రగ్గులు ఈ ఉత్సవంలో ఉంటాయన్నారు. ఢిల్లీ, ముంబయి, పూణె, జైపూర్, బెంగళూరు, చెన్నయ్, అహ్మదాబాద్, సూరత్‌తో పాటు ఆన్‌లైన్‌లో కూడా రగ్గులు అందుబాటులో ఉన్నాయన్నారు.

తిరుమల లడ్డు పవిత్రతను గత ప్రభుత్వం దెబ్బతీసింది

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గత వైసిపి ప్రభుత్వం తిరుమల లడ్డు పవిత్రతను దెబ్బతీసిందని విశాఖ ఎంపీ ఎం.శ్రీ భరత్ ఆరోపించారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమలకు ఆవు నెయ్యిని సరఫరా చేసే నందిని సంస్థను ఎందుకు పక్కకు తప్పించారో గత పాలకులు సమాధానం చెప్పాలన్నారు. తిరుపతి తరహా ఘటనలతో మిగిలిన ఆలయాల్లో కూడా పరీక్షలు జరపాల్సిన పరిస్థితి ఉందన్నారు. నేషనల్ డైరీ రిపోర్ట్ ఆధారంగా ఐదు వేర్వేరు పరీక్షలు చేయగా, లడ్డూల్లో స్వచ్ఛమైన నెయ్యి కాకుండా పామాయిల్, ఇతర నూనెలు వాడినట్లు తేలిందని, ఇది భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసే విషయమని తెలిపారు. సిబిఐ విచారణ జరిపితే నిజాలు బయటకు వస్తాయని చెప్పారు. సమావేశంలో టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి పాల్గొన్నారు

భూదాన్ భూముల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భూదాన్ భూముల సంరక్షణకు నడుం బిగించినట్టు ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ చైర్మన్ ఎన్.రాంబాబు నాయుడు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 2000 ఎకరాలకుపైగా భూదాన భూములు ఉన్నాయని తెలిపారు. వీటిలో సర్వే నెంబరు 132లోని 50.56 ఎకరాల భూదాన్ యజ్ఞ బోర్డుకు చెందిన భూమిని అన్యాక్రాంతం కాకుండా సంరక్షించే చర్యలు చేపట్టామన్నారు. నాడు ఆచార్య వినోబాభావే భూదాన్ ఉద్యమాన్ని ప్రస్తావించారు. సమావేశంలో తెలంగాణ భూదాన బోర్డు చైర్మన్ ఆర్.శంకర్ నాయక్, ఎపి ప్రధాన కార్యదర్శి డి దీనబంధు, ఉపాధ్యక్షురాలు వల్లూరి లత, కార్యనిర్వాహక కార్యదర్శులు రవికుమార్, జి.ప్రదీప్ దాస్ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి స్ఫూర్తితో..

ఉద్యమ శక్తులు ముందుకు సాగాలి

- ఏచూరి సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పలువురు వక్తలు



సంతాప సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై పలు పార్టీల నాయకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ ఎంవిపి కాలనీ

దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి, చట్టసభల్లో బహు భాషల్లో ప్రసంగాలు చేసి, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు గడించిన కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేత, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఉద్యమ శక్తులు ముందుకు సాగాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. శుక్రవారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాప సభ జరిగింది. సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏచూరి సహజ సిద్ధమైన మేధావి అని తెలిపారు. 1970వ దశకం జెఎన్‌యులో చదువుకున్న నాటి నుంచి.. 2024 ఎన్నికల్లో ఇండియా బ్లాక్ ఏర్పాటు చేసినంతవరకూ ఆయన నిర్వహించిన పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. రాష్ట్రంతో ఏచూరికి ఉన్న అనుబంధాన్ని వివరించారు. కాకినాడకు చెందిన సీతారాం ఏచూరి చిన్నతనం నుంచీ ఎలా ఎదిగారో తెలిపారు. ఆయన మరణం లౌకిక ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. దేశ పరిస్థితులకు అనుగుణంగా కార్మిక, ప్రజా ఉద్యమాలను నిర్మించడం, కొత్త సమాజం కోసం చేసే కృషి మాత్రమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. విశాఖతో ఏచూరికి విడదీయరాని బంధం ఉందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ఉద్యమాల్లో తొలి నుంచీ పాల్గొన్నారన్నారు. విశాఖలో 2015లో జరిగిన సిపిఎం 21వ జాతీయ మహాసభలో ఆయన జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన విషయాన్ని గుర్తుచేశారు. సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం కష్టజీవులకు తీరని లోటని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి సలపాలన్నారు. నాడు స్వయంగా ఇందిరా గాంధీని జెఎన్‌యు వీసీగా సీతారాం ఏచూరి రాజీనామా చేయించడం అప్పట్లో ఉద్యమాలకు ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చిందని గుర్తుచేసుకున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్ రెడ్డి పార్లమెంట్‌లో చేసిన కృషిని వివరించారు. వారిరువురూ కమ్యూనిస్టు భావజాలాన్ని ముందుకు నడిపించారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో మరణించే వరకూ ఉద్యమించడం గొప్ప విషయమన్నారు. ఆమ్ ఆద్మీ రాష్ట్ర కన్వీనర్ శీర రమేష్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఎంతో మందికి ఆదర్శమన్నారు. చివరి వరకు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి వెళ్లారన్నారు. సిపిఐ ఎంఎల్ (ప్రజాపోరు) జిల్లా కార్యదర్శి దేవా మాట్లాడుతూ నీతి, నిజాయితీలతో ఏచూరిలా రాజకీయాల్లో కొనసాగడం గొప్ప విషయమన్నారు. ఎస్‌యుసిఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.ప్రమీల మాట్లాడుతూ ఏచూరి ఏ ఆశయం కోసం పోరాడారో దానిని ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుధాకర్ మాట్లాడుతూ ఇండియా బ్లాక్ రూపకల్పనకు ఏచూరి కీలక సూచనలు చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు గణేష్ పాండా, ఆర్‌పిఐ (అంబేద్కర్) అఖిల భారత ఉపాధ్యక్షులు బొడ్డు కళ్యాణ్‌రావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అశోక్ పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పేదల సొంతింటి కలను నెరవేర్చడంలో భాగస్వామ్యమవుతూ, మంజూరైన ప్రతి ఇల్లునూ అధికారులు దగ్గరుండి కట్టించాలని, గుత్తేదారులకు, లబ్ధిదారులకు సంపూర్ణ సహకారం అందించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎమ్‌డి రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, విఎంఆర్‌డిఎ కమిషనర్ కె.విశ్వనాథన్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం జివిఎంసి మీటింగు హాలులో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాల ప్రగతిని తెలుసుకున్న ఆయన మరిన్ని ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. సాంకేతిక సమస్యలను అధిగమించి నిర్మాణాల్లో జోరు పెంచాలని, విశాఖపట్నం జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని సూచించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 1.0 పథకంలో భాగంగా లబ్ధిపొందిన వారికి మరొక గృహ సంబంధిత పథకంలో అవకాశం రాదని రాజాబాబు స్పష్టం చేశారు. పిఎం ఆవాస్ యోజన 2.0 నేపథ్యంలో కొంతమంది లబ్ధిదారులు పునరాలోచనలో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని గుర్తు చేశారు. దీనిపై లబ్ధిదారులకు క్షేత్రస్థాయి అధికారులు క్షుణ్ణంగా విడమరిచి చెప్పాలని, ఇప్పుడు మంజూరైన ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకునేలా ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను ఒప్పించాలన్నారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు అందరూ చొరవ చూపాలని అన్నారు. పెండింగ్ బిల్లులేమైనా ఉంటే నివేదించాలని, వారం రోజుల్లో పరిష్కరిస్తానని చెప్పారు. మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేసి లబ్ధిదారులను ఉత్సాహంగా భాగస్వామ్యం చేయాలని సూచించారు.

జిల్లాలో జరిగిన ఇళ్ల నిర్మాణాల ప్రగతిని గృహ నిర్మాణ శాఖ ఎమ్‌డికి వివరించిన జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వంద రోజుల ప్రణాళికకు అనుగుణంగా అందరం సమన్వయంతో పని చేస్తామని, ఇళ్ల నిర్మాణాల్లో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధిస్తామని చెప్పారు. లేఅవుట్లలో ఉన్న సాంకేతిక సమస్యలను అధిగమించి ముందుకెళ్లామని, కనీస వసతులను కల్పిస్తూ లబ్ధిదారులకు సంపూర్ణ సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

రోజుకు 80 నుంచి 100 ఇళ్లకు సంబంధించి స్టేజ్ అప్డేషన్ జరగాలని అధికారులకు నిర్దేశించారు. జియో ట్యాగింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ డి.అఖిల, విశాఖ, భీమిలి, పెందుర్తి ఆర్‌డిఒలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, శేష శైలజ పాల్గొన్నారు.

జివిఎంసి స్థాయీ సంఘంలో...
పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు జివిఎంసి స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి వెల్లడించారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 124 అంశాలతో కూడిన అజెండాను పొందుపరచగా, వాటిని స్థాయీ సంఘం సభ్యులు చర్చించిన పిదప రెండు అంశాలను రద్దు పరిచామని, 35 అంశాలను వాయిదా వేశామని తెలిపారు. మిగిలిన 84 అంశాలను సభ్యులు ఆమోదించారన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన సుమారు రూ.13.18 కోట్లు, ప్రజారోగ్య విభాగానికి సుమారు రూ.2.26 కోట్ల అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. సమావేశంలో జివిఎంసి కార్యదర్శి ఎంవిడి.ఫణిరామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీర్లు దిలీప్, రత్నాకర్ రెడ్డి, సహాయక వైద్యాధికారులు కిషోర్, కిరణ్ కుమార్, కృష్ణంరాజు, సునీల్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు వంశీ, వెంకటేశ్వరరావు, మాధవరావు, అప్పారావు పాల్గొన్నారు.

ఇగ్నో ఆధ్వర్యాన చిత్ర లేఖన పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్వచ్ఛతా హీ సేవా కారక్రమంలో భాగంగా ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యాన లాసన్స్ బే కాలనీలో ఉన్న జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు గోనిపాటి ధర్మారావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.సథాకిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ ధర్మారావు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను తెలియజేశారు. చిత్రలేఖన పోటీల్లో 40 మంది పాల్గొన్నారు. విజేతలకు అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని ఇగ్నో ప్రాంతీయ కేంద్ర కార్యాలయంలో జరిగే కారక్రమంలో బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఇగ్నో ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టులో
జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుడు పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జి.సునీల్ కుమార్ బాబు, ప్రైవేటు సెక్రటరీ వి.క్రాంతి కుమార్ శుక్రవారం విశాఖపట్నం పోర్టులో పర్యటించారు. పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె వారికి సాదర స్వాగతం పలికారు. కమిషన్ సభ్యుడు రామ్‌చందర్ పోర్టు అధికారులు, ఎస్‌సి ఉద్యోగులు, అధికారుల సంఘం ప్రతినిధులతో కలిసి పరిపాలనా కార్యాలయ ప్రాంగణంలో మొక్క నాటారు. అనంతరం అయన పోర్ట్ ఎస్‌సి ఉద్యోగులు, అధికారుల సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పోర్టు మేనేజ్‌మెంట్‌తో రిజర్వేషన్ విధానం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పోర్టులో ఉన్న మౌలిక సదుపాయాలు, ఎగుమతి, దిగుమతి సౌకర్యాలు, వ్యాపార అవకాశాలు, హరిత చర్యలు, కొనసాగుతున్న ప్రాజెక్టులను అక్కడి అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్‌సి సంక్షేమానికి సిఎస్ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తున్నట్టు తెలిపారు. పోర్టు సేవలపై రామ్‌చందర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

గవర్నర్‌కు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ రెండు రోజుల విశాఖ పర్యటన శుక్రవారంతో ముగిసింది. ఎయులో గురువారం ఏర్పాటు చేసిన దివ్య కళా మేళా ప్రారంభోత్సవం కోసం ఆయన జిల్లాకు విచ్చేసిన సంగతి తెలిసిందే. పర్యటన ముగియడంతో విశాఖ విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం ఆయనకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారి హుస్సేన్ సాహెబ్, పోలీస్, ఎయిర్ పోర్ట్ అధికారులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.